ముందుకు సాగని పనులు

- మధ్యలోనే నిలిచిన ఆర్మూర్ గ్రంథాలయ పై అంతస్తు నిర్మాణ పనులు
- ఇబ్బందుల్లో పాఠకులు, అభ్యర్థులు


పనులు నిలిచిపోయిన గ్రంథాలయ భవనం


ఆలయ ఆవరణలో భోజనం చేస్తున్న అభ్యర్థులు(ఫైల్)

ఆర్మూర్‌టౌన్: మండల కేంద్రంలోని గ్రంథాలయం పై చేపడుతున్న నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పలు ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసింది. దీంతో అభ్యర్థులు హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్లకు వెళ్లకుండా ఇంటి వద్ద, గ్రంథాలయాల్లో చదువుకుంటున్నారు.

ఆర్మూర్ పట్టణంలోని జంబిహనుమాన్ ఆలయ ఆవరణలో ఉన్న గ్రంథాలయంలో ప్రతి రోజు వందల సంఖ్యలో పాఠకులు, అటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు చదివేందుకు వస్తున్నారు. దీంతో స్థలం సరిపోక పోవడంతో గత ప్రభుత్వం పై అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. కాగా ఆ నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కొన్ని నెలల క్రితం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆర్మూర్ గ్రంథాలయాన్ని పరిశీలించారు. పై అంతస్తు భవనాన్ని త్వరలోనే పూర్తిచేసి అభ్యర్థులకు వినియోగంలో తీసుకుస్తామని చెప్పినా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో పాటు గ్రంథాలయంలో ఒకే ఒకే మరుగుదొడ్డి ఉండడంతో అభ్యర్థులు అవస్థలు పడుతున్నారు. ఉదయం ఆరు నుంచి రాత్రి 8 గంటల వరకు గ్రంథాలయంలో అభ్యర్థులు చదువుకుంటున్నారు. స్థల లేమితో మధ్యాహ్న భోజనానికి అభ్యర్థులు జంబిహనుమాన్ ఆవరణలో కూర్చుని తినాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభం

గ్రంథాలయం పైఅంతస్తు నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతులకు 2023మే7న శంకుస్థాపన చేశారు. రూ. 42.5లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. భవవ నిర్మాణం ఓ దశకు వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తి చేయాలని పాఠకులు, అభ్యర్థులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గ్రంథాలయ భవనంపై నిర్మిస్తున్న మొదటి అంతస్తు భవన నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. భవన నిర్మాణం పూర్తయితే పాఠకుల సంఖ్య పెరుగుతుంది. దీంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు, పాఠకులకు సౌకార్యంగా ఉంటుంది. – వరలక్ష్మి, గ్రంథాలయ పాలకురాలు

అందుబాటులోకి తేవాలి

గ్రంథాలయం పై నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు మరింత ప్రశాంతంగా చదువుకునేందుకు వీలు ఉంటుంది. పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి. – రాజు, పాఠకుడు, ఆర్మూర్

క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు శనివారం తనిఖీ చేశారు. వంటశాలలో నిలువ చేసిన సరుకులు, వండుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పెర్కిట్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. దీంతో పాటు 21, 22 వార్డులలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను పునఃపరిశీలించారు. హెచ్‌ఎం శ్రీనివాస్, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

రక్తదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సంతోష్‌నగర్ కాలనీకి చెందిన రజిత అనే మహిళకు సైదు నరేశ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు రక్తదానం చేశారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రజితకు రక్తం అవసరం ఉందని తెలుసుకున్న సొసైటీ అధ్యక్షుడు సైదు రమేశ్ తమ సొసైటీ సభ్యుడు తెడ్డు నగేశ్‌తో కలిసి జిల్లా కేంద్రంలో రక్తదానం చేశారు. దీంతో పలువురు వారిని అభినందించారు.

చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని వీడీసీ సభ్యులు కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం వీడీసీ సభ్యులు మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోటార్మూర్ వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

అంధుల అక్షర శిల్పి లూయిస్ బ్రెయిలీ



బోధన్: అంధులకు అక్షర జ్ఞానం అందించేందుకు ప్రత్యేకంగా లిపి కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ వారి జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గైని రాములు, యేశాల గంగాధర్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆవరణలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ముందుగా బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వేదిక జిల్లా, డివిజన్ ప్రతినిధులు షేక్ నజీర్, సాయిలు, గంపల శంకర్, పల్లికొండ చింటు, నేహాల్, గంగారాం, పోచయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం అందించాలి



రుద్రూర్: పాఠశాలల్లో ప్రత్యేక తరగతులకు హాజరువుతున్న పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం ఇవ్వాలని శనివారం పొతంగల్ ఎంఈవో లోల శంకర్‌కు విద్యార్థులు, స్థానికులు వినతిపత్రం అందజేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పాఠశాలలోనే ఉండాల్సి వస్తోందని అన్నారు. ఆకలి వల్ల చదువుపై ఏకాగ్రత లోపిస్తుందన్నారు. గతంలో ఇచ్చిన మాదిరిగానే అల్పాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్ హన్మాండ్లు, అశోక్, సాయిలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో ప్రతినిధులు



మోర్తాడ్: కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో భీమ్‌గల్ టీఎన్జీవో ప్రతినిధులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పేద విద్యార్థుల కోసం అవసరమైన నోట్‌బుక్స్‌లను అందించారు. కార్యక్రమంలో మాణిక్యం, కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, ఎడెల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పేరిట రైతు భరోసాను నీరుగార్చే యత్నం


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేల్పూర్: రైతుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలనే ఆలోచనతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా సాయాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్, రైతులు అంక్సాపూర్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతులకు అరకొరగా పంటల రుణమాఫీ చేసిన మాదిరిగానే రైతు భరోసాను తగ్గించాలనే కుట్రతోనే దరఖాస్తుల ప్రక్రియ ముందుకు తెస్తోందని ఆరోపించారు. ఒక్కసారి కూడా దరఖాస్తు చేసుకోకుండానే రైతుబంధు సాయం అందించిన ఘనత బీఆర్‌ఎస్‌దేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బేషరతుగా రైతు భరోసా ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయండి


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఆర్మూర్: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు షరతులు లేకుండా వ్యవసాయ రుణ మాఫీ చేయాలని ఏఐయూకేఎస్ ఆర్మూర్ ఏరియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల గంగన్న, మచ్చర్ల రాజన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను మార్చుకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్మికులకు రెండు వందల రోజులు పని కల్పించాలని, 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయాలని, చిన్న సన్నకారు రైతులకు సామాజిక న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 9న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ముట్టడి చేస్తున్నామన్నారు. రైతులు, కూలీలు హాజరు కావాలని కోరుతూ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి దేవారాం, కిషన్, తలారి గంగాధర్, తర్పటి శ్రీనివాస్, రవి, బాలు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలోపేతం కోసం పర్యటన



రుద్రూర్: బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి త్వరలోనే గ్రామాల్లో జిల్లా నాయకులు పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీని విడినంత మాత్రాన నష్టమేమిలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బాన్సువాడలో బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నాయకత్వంలో మండల స్థాయి, నియోజకవర్గ బాధ్యుల నియామకం చేయనున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు నీరడి సాయిలు, శివ, పున్న పుల్గయ్య, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

అధ్యాపకురాలికి సన్మానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకురాలు లత డాక్టరేట్ పట్టా పొందారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఆర్ని విశ్వ విద్యాలయం నుంచి ఆల్జీబ్రాక్, జియోమెట్రిక్ స్ట్రక్చర్ ఇన్ మిషన్ లాంగ్వేజ్, ఆప్టిమైజెషన్ అల్గారిథం అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా డి లతను కళాశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్, అధ్యాపకులు రాజ్‌కుమార్, శ్యామ్, యాదగిరి, రమ్య, లత, ప్రియాంక తదితరులు సన్మానించి అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

డొంకేశ్వర్: మండల కేంద్రానికి చెందిన పొద్దుటూరి రమణారెడ్డికి మంజూరైన రూ. 20వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడిసెరం భూమేశ్‌రెడ్డి శనివారం అందజేశారు. పలు గ్రామాల బాధితులకు సైతం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

డైరీ ఆవిష్కరణకు తరలిన నాయకులు

ఆర్మూర్‌టౌన్: గద్వాల్ జోగులంబ జిల్లాలో శనివారం నిర్వహించిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణకు బయలుదేరినట్లు ఆర్మూర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సల్లశ్రీనివాస్, చంద్ర్‌నాయకులు తెలిపారు. గద్వాల్‌లో ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ విద్యుత్ శక్తి రంగంలో 70 వసంతాల 327యూనియన్ జైత్రయాత్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ 327 యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

బోధన్: సాలూర మండలం తగ్గెల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బోధన్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఐ లవ్ మై విలేజ్ వ్యవస్థాపకుడు నాగేంద్ర మినరల్‌వాటర్ ప్లాంట్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయనను ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రభావతి, పి రవికిరణ్, రాజు, దేవరావు, అంబదాస్, ధన్‌రాజ్, అశోక్, శ్రీహరి రెడ్డి, కస్తూరి, హన్మాండ్లు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పాఠశాలకు చెందిన గణితశాస్త్రం ఉపాధ్యాయుడు, హెచ్‌ఎం రామ్‌ప్రసాద్ గణిత శాస్త్ర స్టడీ మెటీరియల్‌ను శనివారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



డొంకేశ్వర్: మండలంలోని తొండాకూర్, నూత్‌పల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి శనివారం పరామర్శించారు. బీజేపీ పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల నాయకులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ హామీని అమలు చేయాలి



ఆర్మూర్‌టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ హామీని వెంటనే అమలు చేసి మాదిగలకు న్యాయం చేయాలని ఎమార్పీఎస్ ఆర్మూర్ మండల కో-ఇన్‌చార్జి శ్యామ్ అన్నారు. పట్టణంలోని అరుంధతినగర్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో జాప్యం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో వెయ్యి గొంతులు– లక్ష డప్పులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జనవరి 7 నుంచి జిల్లాలో జరిగే డప్పు కళాకారుల సన్నాహక సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం అరుంధతినగర్ ఎమార్పీఎస్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జంగం గోపి, బాల గణేశ్, మైదం రాము తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విద్యార్థులు



పెర్కిట్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాల విద్యార్థులు శనివారం నిర్మల్ జిల్లాకు విహారయాత్రకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని అర్బన్ పార్కు, ప్రముఖ దేవాలయాలను సందర్శించారు. కరస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. విహారయాత్రలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దాసు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ కోర్టు సముదాయంలో శనివారం పోలీసులకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి రామకృష్ణ నూతన చట్టాలపై, నేర దర్యాప్తులో మెలకువలపై అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం-2023పై పోలీస్ అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, భీంగల్ సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో అంక్సాపూర్ విద్యార్థి ప్రతిభ



వేల్పూర్: మండలంలోని అంక్సాపూర్ హైస్కూలుకు చెందిన విద్యార్థి అభినవ్ సోషల్ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరచి నాలుగో స్థానం పొందినట్లు టీచర్ సదాశివ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్టులో అభినవ్ ప్రతిభ కనబరచగా, నిర్వాహకులు ప్రశంసాపత్రం మెమెంటోతో సత్కరించినట్లు పేర్కొన్నారు.

అడవిపంది మృతి

నందిపేట్: మండలంలోని కుద్వాన్‌పూర్ శివారులోని సోలార్ ప్లాంట్ వద్ద ప్రమాదవశాత్తు అడవిపంది మృతి చెందినట్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సోలార్ ప్లాంట్ చుట్టూ అమర్చిన కంచెను అడవిపంది దాటుతుండగా ప్రమాదవశాత్తు కంచెకు అమర్చబడిన ఇనుప తీగలు మెడకు బిగించుకుని బయటకు రాకుండా పడిపోయి ఉంది. మెడకు ఇనుపచువ్వ గుచ్చుకోవడంతో తీవ్ర రక్తస్రావం కారడంతో పాటు విద్యుత్తు షాక్‌కు గు మృతి చెందింది. దీంతో పశువైద్యాధికారి నితీశ్ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం దహనం చేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


అంకాపూర్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే


వేల్పూర్‌లో..

పెర్కిట్/ వేల్పూర్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో స్కూల్ గ్రేడ్ టీచర్స్ యూనియన్‌కు సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఆర్మూర్ మండల ఎస్జీటీయూ ఆధ్వర్యంలో నూతన రూపొందించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉపాధ్యాయులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పొన్న ప్రవీణ్, ఆనంద్, అరవింద్ కుమార్, బసంత్, గంగారాం, ప్రదీప్ రాజ్, వినోద్, జెస్సు అనిల్, యామాద్రి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్, మోతె ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ నాయకులు క్యాలెండర్లను శనివారం ఆవిష్కరించారు. క్యాలెండర్లను ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమాల్లో నాయకులు బోడ దేవానందం, సీవీ నరసింహారావు, పఠాని గంగాధర్, విజయ్‌కుమార్, దేవారాజ్, రాజేంద్ర, వేల్పూర్, మోతె హెచ్‌ఎంలు రాజన్న, గణేశ్, ప్రైమరీస్కూళ్ల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం


తులసి కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పెర్కిట్: ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్‌ను మండలంలోని అంకాపూర్‌లో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి శనివారం సన్మానించారు. పట్టణానికి చెందిన తులసి కుమార్‌కు ఖమ్మం జిల్లా పుడమి సాహిత్య వేదిక వారు ఇటీవల భారత సేవారత్న పురస్కారాన్ని అందజేశారు. దీంతో ఎమ్మెల్యే అంకాపూర్‌లో తులసి కుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెస్సు అనిల్, యామాద్రి భాస్కర్, ద్యాగ ఉదయ్, పాలక్యం వేణు, కలిగోట ప్రశాంత్, ఉదయ్ గౌడ్, పీర్ సింగ్ నాయక్, దాసరి గోపికృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సర్వసమాజ్ అధ్యక్షుడికి..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ సర్వసమాజ్ నూతన అధ్యక్షుడిగా కొట్టల సుమన్ ఎన్నికైన సందర్భంగా శనివారం కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌కె బబ్లూ, బోడమిది బాలకిషన్, సుధాకర్, లోకేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన


బోధన్‌లో నిరసన తెలుపుతున్న హమాలీలు

బోధన్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ హమాలీలు, స్వీపర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాల్గవ రోజు కొనసాగింది. పట్టణ కేంద్రంలో సివిల్ సప్లయ్ హమాలీలు, స్వీపర్లు సమ్మె శిబిరంలో అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. గతంలో కుదిరిన కూలీ రేట్ల ఒప్పందం జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్వింటాలుకు రూ. 26 నుంచి 29 లకు పెంచిన రేట్లను ఈ ఏడాది జనవరి 1 నుంచి అమలు చేస్తూ, ఏరియర్స్‌తో కలిసి చెల్లించాలని పేర్కొన్నారు. రూ. 10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం అమలు చేయాలని కోరారు. యూనియన్ నాయకుడు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

■ నేడు ఎమ్మెల్యే పర్యటన

నవీపేట: మండలంలోని బినోల సొసైటీ పరిధిలోని గ్రామాల్లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం పర్యటించనున్నారని సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు శనివారం పేర్కొన్నారు. సొసైటీ పరిధిలోని నాళేశ్వర్, లింగాపూర్ గ్రామాల్లో నిర్మించిన ఎరువుల గిడ్డంగులను ప్రారంభిస్తారని వెల్లడించారు.


■ గదుల నిర్మాణానికి శంకుస్థాపన

బోధన్: సాలూర మండల కేంద్రంలో రూ. 13 లక్షలలో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ నూతన గదుల నిర్మాణానికి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేస్తారని సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ శనివారం తెలిపారు. అంతేకాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో రూ.15 లక్షలతో కొత్తగా నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తారని అన్నారు. సంఘ డైరెక్టర్లు, సభ్యులు, రైతులు హాజరుకావాలని కోరారు.

■ 7న విద్యుత్ వినియోగదారుల పరిష్కారవేదిక

నవీపేట: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో ఈనెల 7న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి శనివారం పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్-2 చైర్‌పర్సన్ నారాయణ హాజరయ్యే ఈ వేదికకు నవీపేట, జన్నెపల్లి సెక్షన్‌ల పరిధిలోని వినియోగదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	క్రావెన్ ది హంటర్ (తెలుగు)-12.10, 6.35, 9.30; బేబీజాన్(హిందీ) - 3.05
స్క్రీన్-2	మార్కో (తెలుగు) - 10.00, 1.05, 7.05, 10.10; మ్యాక్స్ (తెలుగు) - 4.10
స్క్రీన్-3	పుష్ప-2 (తెలుగు) - 12.00; ముఫాసా (తెలుగు) - 4.25, 7.15, 10.05
స్క్రీన్-4	ముఫాసా (తెలుగు) - 10.45; పుష్ప2 - 1.35, 6.00, 10.25

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మాక్స్ (తెలుగు)-10.20 10.40 సై (తెలుగు) - 12.55; మార్కో (తెలుగు) - 4.05; పుష్ప-2 (తెలుగు)-6.55
స్క్రీన్-2	ముఫాసా(తెలుగు)3డీ-10.35; మాక్స్ (తెలుగు) - 1.05; పుష్ప-2 (తెలుగు) - 3.45; మార్కో -7.40, 10.35
స్క్రీన్-3	పుష్ప-2(తెలుగు)-1.05 9.50 ముఫాసా 3డీ- 5.00, 7.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	పుష్ప-2 (తెలుగు) - 10.20, 2.45; మార్కో (తెలుగు) - 7.10; ముఫాసా (3డీ ఇంగ్లీష్) - 10.15
స్క్రీన్-2	ముఫాసా (3డీ తెలుగు) -11.00, 1.50, 4.40, 7.30; పుష్ప-2 (హిందీ) - 10.20
స్క్రీన్-3	మార్కో (తెలుగు) - 11.05; పుష్ప-2 (హిందీ) - 2.10; పుష్ప-2 (తెలుగు) - 6.15; బేబీజాన్ (హిందీ) - 10.40
స్క్రీన్-4	క్రావెన్ ది హంటర్(తెలుగు) - 11.00, 7.55; క్రావెన్ ది హంటర్ (ఇంగ్లీష్) - 5.00; మార్కో(తెలుగు) - 1.55, 10.50
లలితామహల్	యుఐ (తెలుగు) - 11.15, 2.15; విడుదల2 (తెలుగు) - 6.15,9.15
దేవి	మార్కో-11.00 2.15 6.10 10.10
నటరాజ్	మ్యాక్స్ (తెలుగు) - 2.00, 9.00; క్రావెన్ ది హంటర్(తెలుగు)- 11.00, 6.00
విజయ్	పుష్ప-2 (తెలుగు) - 10.30, 2.15, 6.10, 10.05

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	80,000	వెండి(కిలో)	92,500
22 క్యారెట్స్	73,815		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	160
		లైవ్	120
స్కిన్‌లెస్	200	మటన్	800